నీటి ఎద్దడిని నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ సభ్యులు

మణికొండ: వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. అధ్యక్షుడు డి. సీతారాం అధ్యక్షతన సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, నూతన రిజర్వాయర్లను అందుబాటులోకి తీసుకురావాలని, నీటి కనెక్షన్ ఉన్న ప్రతి ఇంటికి తక్షణమే క్యాన్ నంబర్లు ఇవ్వాలని జలమండలి అధికారులను కలిసి కోరాలని సభ్యులు నిర్ణయించారు. అలాగే మురుగు నీరు పందెన్‌వాగులో కలవకుండా మున్సిపాలిటీ బయటకు తరలించేలా సమగ్ర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఫ్రెండ్స్ కాలనీ నుంచి యూనియన్ బ్యాంక్ చౌరస్తా వరకు, మర్రిచెట్టు నుంచి ఓయూ కాలనీ వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, ట్రయల్స్ విల్లాల వద్ద బాక్స్ డ్రైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, వాటిని మున్సిపాలిటీ అధికారులు పరిష్కరించాలన్నారు. ఇంటి పన్ను మదింపులో అవకతవకలు ఉన్నాయని, నూతన విధానంతో వేలాది రూపాయల పన్నులు వస్తున్నాయని, వాటిని సరిదిద్దాలని కోరారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనను స్వాగతించారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా వైన్స్‌లు, బార్‌లను ఏర్పాటు చేస్తున్నారని, వాటిని జనావాసాలకు దూరంగా మార్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



జ్ఞానేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నార్సింగి మున్సిపల్ నాయకులు



జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మణికొండ: కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంతో ఆ పార్టీ నాయకులు, అభిమానులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఆయన నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో ప్రభుత్వం ఈ పదవిని అప్పగించినట్లు నాయకులు పేర్కొన్నారు. కలిసిన వారిలో మణికొండ మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ జిల్లా సంయుక్త కార్యదర్శి మాల్యాద్రి నాయుడు, నార్సింగి మున్సిపాలిటీ కార్యదర్శి ఎం. ప్రదీప్‌కుమార్, బి.అభిలాష్, డి.శివ, బి.నరేందర్, ఎం. సుధాకర్, ఎస్. మహేందర్ తదితరులు ఉన్నారు.

బండ్లగూడ నాయకులు..

బండ్లగూడ: జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను ఆదివారం పలువురు నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పని చేస్తాననన్నారు. తనకు సహకరించిన వారందరికి ఆయన ధన్యావాదాలు తెలిపారు.

ఘనంగా విశ్వశాంతి స్కూల్ వార్షికోత్సవం



వార్షికోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ వెంకటేశ్వరకాలనీలోని విశ్వశాంతి గ్లామర్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ, దేశభక్తిని బోధించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కె.కరుణాకర్, డైరెక్టర్లు విజయచందర్, క్రాంతికిరణ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘పేస్ యూరాలజీ కాన్‌క్లేవ్ - 2024’

మాదాపూర్: రోగులకు చికిత్స అందించడంలో అత్యున్నత నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానంతో సేవలను పేస్ హస్పిటల్స్ అందిస్తున్నాయని ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ విశ్వంబర్‌నాథ్ తెలిపారు. మాదాపూర్‌లోని ఆవాస హోటల్‌లో పేస్ యూరాలజీ కాన్‌క్లేవ్–2024ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైద్యరంగంలో ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవాలన్నారు. అధునాతన సంక్లిష్టమైన మూత్ర పిండాల శస్త్రచికిత్స విధానాలు, రోబోటిక్స్, లాపరోస్కోపిక్ యూరాలజీ, కిడ్నీస్టోన్స్ కోసం మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ, కిడ్నీ చికిత్సలోని వివిధ సవాళ్లకు సంబంధించిన ఆయా రంగాల్లోని ప్రముఖ నిపుణులు వారి సూచనలు, సలహాలను అందించారు. ఎబీఓ, అనుకూలత, పీడియాట్రిక్ ట్రాన్స్‌ప్లాంటేషన్, రేడియోలాజికల్ ఇంటర్వెన్షన్‌లతో సహ మూత్ర పిండాల మార్పిడి శస్త్రచికిత్సలపై అవగాహన కల్పించారు. డాక్టర్ సుజాత, డాక్టర్ శ్యామ్‌వర్మ, డాక్టర్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ విశ్వంబర్‌నాథ్



పట్టణంలోని ఫిరంగి నాలాలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ నిషేధంపై పట్టింపేది..?

- శంషాబాద్‌లో నామమాత్రంగా అమలు
- ప్రతిరోజు పట్టణంలో 30 టన్నుల చెత్త ఉత్పత్తి
- ఇందులో సుమారు 5 టన్నులకు పైగా ప్లాస్టిక్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణం ప్లాస్టిక్‌మయంగా మారుతున్నది. గతంలో మున్సిపాలిటీ సిబ్బంది ప్లాస్టిక్ నిషేధంపై వడివడిగా అడుగులు వేసిన తర్వాత పట్టించుకోకపోవడంతో మళ్లీ ప్లాస్టిక్ వాడకం పెరుగుతున్నది. ప్రతిరోజు టన్నుల కొద్ది ఉత్పత్తి అవుతున్న చెత్తలో ప్లాస్టిక్ చెత్త కూడా నాలుగో వంతుకు చేరుతోంది. పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతిరోజు 30 టన్నుల చెత్త ఉత్పత్తి..

పట్టణంలో సుమారు 17 వేలకు పైగా ఆవాసాలు ఉండగా సుమారు లక్షకుపైగా జనాభా నివాసముంటున్నారు. మున్సిపాలిటీ లెక్కల ప్రకారం ప్రతిరోజు సుమారు 30 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇందులో తడి చెత్త 15 టన్నులు ఉండగా, పొడి చెత్త 13 టన్నులు, కూరగాయలు ఇతరత్రా 2 టన్నుల వరకు ఉంటున్నది. ఇందులో 13 టన్నుల పొడి చెత్తలో సుమారు 5 టన్నుల మేరకు ప్లాస్టిక్ కవర్లతో పాటు ఇతరత్రా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి.

అవగాహన కల్పించినా..

వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా సంచులు, టిఫిన్ బాక్సులు పేపర్ బ్యాగులు, పర్యావరణహితమైన సంచులు వాడాలని ఆరు నెలల కిందట మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా అవగాహన కల్పించారు. అయినప్పటికీ కొందరు వ్యాపారులు, దుకాణదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలు కోసం చర్యలు తీసుకుంటున్న క్రమంలో కొందరు దుకాణదారులు మున్సిపల్ సిబ్బందిపై దాడికి సైతం దిగిన ఘటనలు ఉన్నాయి. దీంతో ఈ ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్లాస్టిక్ నిషేధం అమలు అటకెక్కింది.

ఆ దుకాణాల్లో..

పట్టణంలోని టాప్‌బేకరీ చౌరస్తా ముందు ఉన్న కొన్ని దుకాణాలతో పాటు పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో ఉన్న దుకాణాల్లో నేటికి నిషేధిత ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. వీటిని దుకాణాలు, కర్రీ పాయింట్లు, హోటళ్లలో యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. దీనికితోడు సమీపంలోనే ఉన్న గగన్‌పహాడ్, కాటేదాన్‌లో నిషేధిత ప్లాస్టిక్ తయారీ పరిశ్రమలు కూడా ఉండడంతో ప్లాస్టిక్ నిషేధ చర్యలు ఇక్కడ తూతూ మంత్రంగానే జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వందశాతం ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు చేపట్టాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

ఫాంహౌజ్‌లో మద్యం సీసాలు పట్టివేత

శంషాబాద్ రూరల్: మండలపరిధిలోని పోశెట్టిగూడ శివారులో గల నవీ ఫాంహౌజ్‌లో మద్యం సీసాలను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వీటిని ఇక్కడ నిల్వ చేసేందుకు ఎలాంటి అనుమతి లేదని బాటిళ్లు కలిగి ఉన్న రోహిత్, రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకుని మద్యాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

శంషాబాద్ రూరల్: తండ్రి మందలించాడని ఓ యువకుడు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలం పామాపూర్ వాసి ఆరెపల్లి సుబ్రమణ్యం ఊటపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఇతని కుమారుడు వినోద్ (18) రెండు నెలల కిందట కొత్త పల్సర్ బైక్ తీసుకుని ఇంటికి వచ్చాడు.బ ద్విచక్రవాహనం కొనేందుకు డబ్బులు ఎవరూ ఇచ్చారని తండ్రి అడిగాడు. దీంతో వినోద్ ఫిబ్రవరి 27న ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సన్మానం

గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌గా నియమితులైన జి.చిన్నారెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేష్ ఆదివారం సన్మానించారు. చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చిన్నారెడ్డిని బేగంపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రభా భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

చల్లా నర్సింహా రెడ్డిని కలిసిన నాయకులు



చల్లాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంగళారం గోవర్ధన్ రెడ్డి

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డిని పార్టీ జిల్లా కార్యదర్శి మంగళారం గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అత్తాపూర్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం తెలంగాణ సంపదను కొల్లగొట్టిందన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేరికతో పార్టీ మరింత బలపడుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు మహ్మద్ ఖలీద్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్ రెడ్డి, నాయకులు భాస్కర్ గౌడ్, బండారి రమేశ్, రవీందర్ గౌడ్, హరి, సుధాకర్ రెడ్డి, సోమారం రవీందర్, తుమ్మల కృపాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సందడిగా జీ.ఎం.ఎస్ కల్చరల్ ఫెస్ట్



చదువులో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణారావు తదితరులు

సాక్షి,సిటీబ్యూరో: బుడి బుడి అడుగులు వేసే చిన్నారులు కలర్‌ఫుల్ దుస్తులు ధరించి సంగీతానికి అనుగుణంగా డ్యాన్స్ చేస్తూ ఆహూతులతో అదరహో అనిపించారు. అత్తాపూర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్ (జీఎంఎస్) కల్చరల్ ఫెస్ట్– గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం శనివారం రాత్రి అత్తాపూర్‌లో ఓ ఫంక్షన్ హాల్‌లో సందడిగా సాగింది. పాఠశాల ప్రిన్సిపాల్ జి. కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యుడు డాక్టర్ అమరేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణ, పట్టుదలతో వాటిని సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులకు ఏదైనా సాధించగలమని సానుకూల దృక్పథం అవసరమన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణారావు మాట్లాడుతూ, తమ పాఠశాలలో విద్యతో పాటు క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గతేడాది పదో తరగతిలో ర్యాంకులు సాధించిన జీఎంఎస్ విద్యార్థులతో పాటు ఈ విద్యా సంవత్సరంలో వివిధ అంశాల్లో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్, కల్యాణి, కీర్తి, సమత, భాస్కర్, అఖిలా రెడ్డి, జ్యోతి, అశ్విని, శ్రీవాణి, రజిత, తదితరులు పాల్గొన్నారు.

జంప్ జిలానీలు..!

- రసవత్తరంగా రాజేంద్రనగర్ అసెంబ్లీ, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల రాజకీయం
- సార్వత్రిక నగారా మోగిన కొద్ది గంటల్లోనే..
- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి
- అదేబాటలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే..?
- ఇప్పటికే హస్తంగూటికి బండ్లగూడ ప్రజాప్రతినిధులు
- వారి బాటలోనే మరికొందరు..?

మణికొండ: సార్వత్రిక ఎన్నికల నగారా మోగిన కొద్ది గంటల వ్యవధిలోనే రాజేంద్రనగర్ అసెంబ్లీతో పాటు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల టికెట్ ఇస్తామని హామీ దక్కడంతో పార్టీ మారినట్లు తెలిసింది. ఇప్పటివరకు చేవెళ్ల ఎంపీ టికెట్‌ను ఆశించిన పట్నం సునీతామహేందర్‌రెడ్డిని మల్కాజిగిరి నుంచి పోటీ చేయించేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం. ఇక ఇప్పటికే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీ మారేందుకు సానుకూలత వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ తరఫున గెలిచిన 39 మంది ఎమ్మెల్యేల్లో మెజార్టీ సంఖ్య ఎమ్మెల్యేలతో బీఆర్ఎస్ ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నట్లు రాజకీయ వండితులు పేర్కొంటున్నారు. చేవెళ్ల పార్లమెంట్‌కు సీఎం రేవంత్ ఇన్‌చార్జిగా ఉండడంతో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను ఖాళీ చేసే ఎత్తుగడతో వారు ఉన్నట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో చేరిన గంటల వ్యవధిలోనే తన ఫాంహౌస్‌లో తన వర్గంతో సమాలోచనలు చేసి అందరూ పార్టీ మారాలని ఎంపీ రంజిత్‌రెడ్డి సూచించినట్లు సమాచారం.

ముందు వరుసలో బండ్లగూడ..

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తుంది. ఇప్పటికే బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ ఐదుగురు కార్పొరేటర్లతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. వారి చేరికకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పూర్తి మద్దతు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అదే కార్పొరేషన్‌లో అతనికి వ్యతిరేకంగా ఎంపీ రంజిత్‌రెడ్డి గ్రూపుగా ఉన్న డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డితో పాటు 15 మంది కార్పొరేటర్లు కూడా త్వరలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. దాంతో అక్కడ ప్రస్తుత సిట్టింగ్ కార్పొరేటర్లలో ఒకరిద్దరు తప్ప అందరూ కాంగ్రెస్ గూటికే చేరనున్నారు. మణికొండ మున్సిపాలిటీలోనూ బీఆర్ఎస్ కౌన్సిలర్లలో కొందరు ఎంపీ, మరికొందరు ఎమ్మెల్యే వెంట పార్టీ మారేందుకు సంసిద్ధులైనట్లు కార్యకర్తలు పేర్కొంటున్నారు. నార్సింగి మున్సిపాలిటీలోనూ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వెంట నడిచేందుకు మెజార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. వీరంతా ఎమ్మెల్యే ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పార్టీలు మారేందుకు సిద్ధం కాగా కిందిస్థాయి కార్యకర్తలు మాత్రం ఇంత సునాయాసంగా కండువాలు మారుస్తారా.. రాజకీయాలు అంటే సిద్ధాంతాలు, పార్టీల జవసత్వాలు, సిద్ధాంతాలు అవసరం లేదా అని ప్రశ్నిస్తున్నారు. వారి వెంట కార్యకర్తలు, కింది స్థాయి నాయకులు కదులుతారా.. లేక అదే బీఆర్ఎస్‌లో కొనసాగుతారా..? వేచి చూడాల్సిందే.

పాత నాయకుల్లో గుబులు..

ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంపీతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడంతో ముందు నుంచి కొనసాగుతున్న పాత నాయకుల్లో గుబులు రేగుతోంది. దశాబ్దకాలంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండగా తామంతా అనేక కష్టనష్టాలకు ఓర్చి కాంగ్రెస్ పార్టీని బతికించామని, ఇప్పుడు వారంతా వస్తే తమ పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన వర్గం టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరడంతో టీఆర్ఎస్ పార్టీలో ఉద్యమ కాలం నుంచి పార్టీ కోసం పనిచేసిన నాయకులు కనుమరుగై పోయారని వారు గుర్తు చేస్తున్నారు. ఇప్పటివరకు వార్డులు, గ్రామాల్లో అధికార పక్షం, ప్రతిపక్షంగా ఉన్న నాయకులు ఇప్పుడు ఒకే పార్టీలో ఇమిడి ఎవరూ ప్రయోజనం పొందుతారనే చర్చ సర్వత్రా వినిపిస్తున్నది.

‘హిందుత్వం’ మతం కాదు

చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం: హిందుత్వం అనేది ఒక మతం కాదని, దేశంలోని కొన్ని వర్గాలను కలిపే ఒక వారధి అని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. రాయదుర్గంలోని విస్పర్‌వ్యాలీలో ఆదివారం అల్పాహార సమావేశంలో ఆయన పాల్గొని స్థానికులతో మాట్లాడారు అనంతరం మాట్లాడుతూ.. హిందుత్వం కోసం ఒక్కొక్కరు ఒక్కొక్కటి చెప్తారని అవేమీ సరికావని, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ చెప్పేవే సరైనవన్నారు. రామమందిర నిర్మాణం కోట్లాది మంది భారతీయుల కల అని పేర్కొన్నారు. ఆ కలను ప్రధాని నరేంద్రమోదీ సాకారం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ మందిర నిర్మాణానికి దేశంలోని కోట్లాది మంది ప్రజలు తమ వంతుగా విరాళాలు అందించారన్నారు. ధనిక, పేద పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ మహత్తర ఘట్టంలో పాలుపంచుకున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న భక్తులు ఆ శ్రీరామచంద్రుడి దర్శనం కోసం వెల్లువలా తరలి వెళ్తున్నారన్నారు. ప్రధాని ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. తెలంగాణ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, జాతీయ స్థాయిలో స్థిరమైన ప్రభుత్వం ఉంటే ధృఢమైన నిర్ణయాలు తీసుకుంటారనేందుకు బీజేపీ పరిపాలన నిదర్శనమన్నారు. రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చేవెళ్లలో ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పలువురు బీజేపీ నేతలు, విస్పర్‌వ్యాలీ వాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌కు సన్మానం



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ: రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాస్‌రెడ్డిని మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని అబ్దుల్ కలాం పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు. అదే టౌన్‌షిప్‌లో ఉంటున్న ఆయన ప్రతిరోజు వారితో కలిసి వాకింగ్‌కు వెళ్తుంటారు. తమ సభ్యుడు మీడియా అకాడమీ చైర్మన్ కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో జర్నలిస్టులకు సరైనా న్యాయం జరుగుతుందని వారు ఆకాంక్షించారు.

పాట్నాకు బయలుదేరిన విద్యార్థులు



బిహార్‌లో పర్యటించనున్న విద్యార్థుల బృందం

రాయదుర్గం: యువ సంఘం ఫేజ్–4 కార్యక్రమంలో భాగంగా తెలంగాణ నుంచి బిహార్‌కు విద్యార్థులు ఆదివారం పయనమయ్యారు. మంగళవారం నుంచి ఈనెల 23 వరకు బిహార్‌లో విద్యార్థులు పర్యటించనున్నారు. బీహార్‌లోని నిట్–పాట్నా, హెచ్‌సీయూ ఈ కార్యక్రమానికి సమన్వయం చేస్తారు. ఈ యాత్రలో తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి 45 మంది విద్యార్థులు, హెచ్‌సీయూ నుంచి ఇద్దరు ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ వంశీ, డాక్టర్ నరేష్, ఇద్దరు సహాయక సిబ్బంది శ్రీశైలం, రాజేష్ పాల్గొంటున్నారు. ఆదివారం హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.

వాల్ రైటింగ్స్, పోస్టర్ల తొలగింపు

శేరిలింగంపల్లి: సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో రోడ్లపై ఉన్న రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్స్, వాల్ రైటింగ్‌ను జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, భారతీనగర్ డివిజన్ల పరిధిలోని రోడ్లపై ఉన్న కటౌట్స్, వాల్ పోస్టర్స్, వాల్ రైటింగ్‌లను తొలగించే పనుల్లో శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు. శనివారం సాయంత్రం నుంచే వాటిని తొలగించే పనులు చేపట్టినట్లు శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని 7 ప్రదేశాల్లో వాల్ రైటింగ్స్, 43 పోస్టర్స్, 11 ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు, 7 ప్రదేశాల్లో తోరణాలను తొలగించినట్లు వివరించారు. సోమవారం వరకు పూర్తికి తొలగిస్తామని ప్రకటించారు.

‘రంజాన్ మాసం ఎంతో పవిత్రమైంది’



హకీంపేట్‌లో జరిగిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని నానల్‌నగర్ హకీంపేట్‌లోని ఏక్‌మినార్ మసీద్ ఖతీబ్ మహ్మద్ ఆఫేజ్ అబ్దుల్ రహమాన్ అన్నారు. ఆదివారం మజీద్ వద్ద ఇఫ్తార్ కార్యక్రమం నిర్వహించారు. ఇఫ్తార్‌కు ముందు ఆయన కార్యక్రమంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి మాట్లాడారు. రోజా ఉండడానికి వయస్సు, లింగబేధంతో సంబంధం లేదని అన్నారు. ఏడేళ్ల పైబడ్డ పిల్లలు సైతం పెద్దల పర్యవేక్షణలో ఉపావాస దీక్షలు ఆచరించాలని ఆయన అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు సైతం ఉపవాస దీక్షలు ఆచరించాల్సిందేనని ఆయన అన్నారు. తరావీ ప్రార్థనలకు కూడా ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. కేవలం రంజాన్ నెలలోనే జరిగే తరావీ ప్రార్థనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫారాన్, ఆలీముద్దీన్, అజీజ్‌ఖాన్ పఠాన్, జుబేర్ బిన్ అవద్, మిర్జా ఎక్బాల్ అహ్మద్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

గోల్కొండ: హిందూ జనజాగరణ కార్వాన్ శాఖ, బీజీజీసీఐ సంయుక్తంగా మహిళల్లో యువత, మహిళల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్వాన్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. దేశంలో యువతతో పాటు మహిళా స్వశక్తితో కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోదీ అందిస్తున్న అనేక పథకాలపై పలువురు వక్తలు ఈ కార్యక్రమంలో వివరించారు. పథకాన్ని బట్టి రూ.10 నుంచి 2 కోట్ల రూపాయల వరకు కేంద్ర ప్రభుత్వం యువత, మహిళలకు రుణాలు ఇస్తుందని వక్తలు వివరించారు. ముద్రాలోన్, విశ్వకర్మ యోజన, స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఈఎంఈజీపీ, ఎడ్యుకేషన్ లోన్ ఏ విధంగా పొందవచ్చో వక్తలు వివరంగా తెలియపరిచారు.

ఈ నెల 19, 20 న సిటీ కళాశాలలో జాతీయ సదస్సు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీలలో జాతీయ సదస్సు జరుగుతుందని ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ తెలిపారు. రసాయన శాస్త్రం–బహు శాస్త్రంతార పరిశోధన అవకాశాలు అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యం, లారస్ లాబ్స్, ఎస్ ఎస్ కె బయో సైన్సెస్ సహకారం అందిస్తున్నాయన్నారు. కెమిస్ట్రీ విభాగం అధ్యక్షుడు డా.ఏలూరి యాదయ్య సమన్వయం చేస్తున్న ఈ సదస్సులో రాష్ట్ర, రాష్ట్రేతర అధ్యాపకులు, ఆచార్యులు పాల్గొంటున్నారన్నారు. 19వ తేదీ ప్రారంభ సభను ఐఐసిటి సంచాలకులు డా.డి.శ్రీనివాస రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఈ సదస్సులో ప్రముఖ పరిశోధకులు ఆచార్య సీహెచ్. సుబ్రహ్మణ్యం, డా.కె.రాజేందర్ రావు, డా.ఎన్. రవికుమార్ రెడ్డి, డా.పి.దివాకర్ తదితరులు పాల్గొంటారన్నారు. ఇతర దేశాల నుంచి శాస్త్ర వేత్తలు ఆన్‌లైన్ లో పత్ర సమర్పణ చేస్తారన్నారు. డా.విప్లవ్ దత్ శుక్లా, డా.దయానంద్, వసంత, అనిల్ బూసి, డా.రత్న ప్రభాకర్, డా.జె.నీరజ, డా.రవి కుమార్, డా.శంకర్, డా.భాస్కర్ సదస్సు నిర్వహణలో సహకరిస్తారని కార్యక్రమం సమన్వయకర్త డా.యాదయ్య తెలిపారు.